నమస్తే తెలంగాణ

# జిందగీ

హైదరాబాద్ | ఆదివారం
28 జనవరి 2024
www.ntnews.com








**చిరంజీవి!**.. కలలో ఎవరు పిలిచారో?
ఎందుకు పిలిచారో? శివశంకర వరప్రసాద్
ఆనాటి నుంచి చిరంజీవి అయ్యాడు.
ఆ పిలిచిన వ్యక్తి ఎవరో తెలియదు!
ఏ క్షణంలో పిలిచాడో..
చిరంజీవి సుప్రీం హీరో అయ్యాడు.
మెగాస్టార్ అయ్యాడు.
ఎందరు పోతున్నా...
మరెందరు వస్తున్నా...
**మెగాస్టార్** ఒక్కడే!
**చిరంజీవి** ఒక్కడే!!
పద్మవిభూషణ్ పురస్కారానికి
ఎంపికైన చిరు కథ..





# జై చిరంజీవ!


★ ★ ★ ★ ★ ★

**సినిమాల్లోకి** వచ్చిన కొత్తల్లో ఒకరోజు నిర్మాత క్రాంతికుమార్ కస్సుమన్నాడు.. చిరంజీవి నొచ్చుకున్నాడు కానీ, కిక్కురుమనలేదు. ఆ వినయం, వివేచనే అతని కెరీర్‌కు 'పునాదిరాళ్లు' అయ్యాయి!

**బాపు** నుంచి పిలుపు.
'మనవూరి పాండవులు'లో
అర్జునుడి తరహా పాత్ర.
అందులో ఒక సీన్..
అందరూ అలా వచ్చి భోజనానికి కూర్చోవాలి.
సాదాసీదాగా వస్తే చిరంజీవి ఎందుకు అవుతాడు.
సీనుకు ముందు.. షర్ట్ మీద, తలలో కాస్త గడ్డిపరకలు తగిలించుకొని, వాటిని దులుపుకొంటూ వచ్చి కూర్చున్నాడు.
కెమరామెన్‌కు అర్థమైంది.
'అబ్బో! అసాధ్యుడే' అనుకున్నాడు.
ఏ డైలాగ్ లేనిచోట కూడా ఆడిటోరియం దృష్టిని ఆకర్షించే టెక్నిక్ చిరంజీవికి రెండో సినిమా నుంచే అబ్బింది.

**బాలచందర్** దృష్టి పడింది.
'ఇది కథ కాదు'లో చిరు పాత్ర పండింది!!
'కోతలరాయుడు' రిలీజైంది...
మొదటిసారి హీరో డ్యాన్సులకు థియేటర్ స్క్రీన్లపై నోట్ల వర్షం కురిసింది.
హీరోగా ఎస్టాబ్లిష్ అవుతున్నా... సహనటుడి పాత్రలొస్తే వద్దనలేదు. విలనీ చేశాడు. కామెడీ చేశాడు. ఓ సినిమాలో భయపడ్డాడు... ఇంకో సినిమాలో భయపెట్టాడు.
మొత్తంగా చిరంజీవి దర్శక, నిర్మాతలకు ప్రయోగశాలగా మారాడు. ఎంత మారాలనుకున్నా మారలేక, మారుతున్న దేహాన్ని కాపాడుకోలేక 'పున్నమినాగు'లో మిన్నాగు కన్నా భయంకరంగా పగ సాధించిన వైనాన్ని ఎలా మర్చిపోగలం? లవర్ బాయ్‌గా, క్లెవర్ ఎనిమీగా 'న్యాయం కావాలి'లో మరో విలనీ క్యారెక్టర్!

**వరుస** అవకాశాలు.. వెనకాలే విజయాలు. నిర్మాతలకు లంకెబిందె దొరికినట్టు అనిపించింది. దర్శకులకు ఊట బావి దారి తెలిసింది. తోడుకున్నంత తోడుకోవచ్చు అని వాళ్ల అభిప్రాయం. పెట్టిందానికి పదింతలు పక్కాగా వస్తుందని నిర్మాత కృతనిశ్చయం. ఈ మెరుపు నటుడికి.. కోదండరామిరెడ్డి అనే ఉరుము జతకలిసింది. ఈ జోడీకి యండమూరి తోడయ్యాడు. వీరందరికీ ఇళయరాజా సూటయ్యాడు. ఇంకేముంది 'యురేకా సకామికా...'! సినిమా మీద వాళ్ల 'అభిలాష' తీరే దాకా... విరుచుకుపడ్డారు. ఫక్తు ప్రయోగాత్మక సినిమా 'అభిలాష'. దీన్ని పక్కా కమర్షియల్ సినిమాగా తీసేశారు. ఇందులో అమాయక చిరంజీవి, జాయ్‌ఫుల్ చిరంజీవి, బెదిరిపోయే చిరంజీవి, బెదిరించే చిరంజీవి.. ఒక్క టికెట్ మీద పది పాత్రలు వండి వడ్డించాడు. చిరు, కోదండరామిరెడ్డి హిట్ ఫార్ములా! కథ ఎవరిదైనా వీరిద్దరూ కలిశారంటే హిట్టు. మ్యూజిక్ ఎవరైనా వీరిద్దరి సినిమా అంటే హిట్టు. 'ఖైదీ' ఓపెనింగ్ సీన్ చాలు... చిరంజీవిని దర్శకుడు కోదండరామిరెడ్డి ఏ రేంజ్‌లో చూపించాడో చెప్పడానికి. 'ఛాలెంజ్' చాలు వీరిద్దరి కాంబినేషన్‌కు తిరుగులేదని చెప్పడానికి.
కె.విశ్వనాథ్, రాఘవేంద్రరావు, కోడి రామకృష్ణ, విజయబాపినీడు ఇలా ఒక్కో దర్శకుడు చిరంజీవిని ఒక్కో రేంజ్‌లో చూపించారు.



**ఈ** యాక్షన్ హీరోలో
కామెడీ పాళ్లూ ఎక్కువే!
ఎంత పర్‌ఫెక్ట్‌గా పవర్ పంచ్ ఉంటుందో.. కామెడీ టైమింగూ అంతే ఇదిగా పండుతుంది. 'మంత్రిగారి వియ్యంకుడు' సినిమాలో బాపూ స్టయిల్‌లో ముళ్లపూడి వారి టైమింగ్‌ను అందుకున్న చిరంజీవి... దర్శకుడు జంధ్యాల 'చంటబ్బాయ్'లో డిస్టింక్షన్‌లో పాసయ్యాడు. 'వెల్‌కమ్ మిస్ జ్వాలా..' సన్నివేశం ఎన్నిసార్లు చూసినా నవ్విస్తుంది. గుర్తొచ్చినప్పుడల్లా నవ్విస్తుంది. నవ్వాలనుకున్నప్పుడల్లా ఆ సీను గుర్తొస్తుంది. 'జేబుదొంగ'లో స్టీల్‌ప్లాంట్ బాబాయ్ వేషాలు గుర్తున్నాయిగా! అప్పుడెప్పుడో మొదలైన కామెడీ చిరంజీవి ప్రతి సినిమాలోనూ ఉంటుంది. పరిధి మేరకే ఉన్నా... అపరిమితంగా ఆకట్టుకుంటుంది. 'దొంగమొగుడు'లో కాళ్లు, కళ్లు లేనివాడిగా నటిస్తూ బ్లాక్ టికెట్లు అమ్ముతుంటాడు చిరంజీవి. పోలీసులు అటకాయిస్తే.. 'నాకు కళ్లొచ్చాయ్.. నేనన్నీ చూడగలుగుతున్నా! నాకు కాళ్లొచ్చాయ్ నేను నడవగలుగుతున్నా..' అని లగెత్తుకొని పరిగెత్తడం చూసి ప్రేక్షకులు వేసిన ఈలలు ఆయన అభిమానులకే కాదు, హాస్యాన్ని ఇష్టపడే వారందరికీ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. 'రౌడీ అల్లుడు'లో ఆటోజానీగా చిరు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు! 'గ్యాంగ్‌లీడర్'లో 'శబరి..' అంటూ తన బామ్మను ఆటపట్టించిన వైనం చిరుకే చెల్లు. ఇలా ఎన్ని సినిమాలని గుర్తు చేసుకుంటాం... ఆనాటి 'కోతల రాయుడు' నుంచి ఈనాటి 'వాల్తేరు వీరయ్య' వరకు పరికిస్తే... ఈ 'శంకర్‌దాదా' హాస్యం పండించడంలో ఎంబీబీఎస్ చేశాడేమో అనిపించకమానదు.

**'మనవూరి** పాండవులు' షూటింగ్ సమయంలో... రాత్రిళ్లు డ్యాన్స్ చేస్తూ.. 'ఎప్పటికైనా ఈ స్టెప్పులతో ఇండస్ట్రీని ఊపేస్తా' అనేవాడట చిరంజీవి. మాటవరుసకు అన్నమాట కాదిది. బాడీలో స్ప్రింగ్‌లు మింగేసినంత స్వింగేం ఉండదు. ఎముకల్ని అతిగా మెలికలు తిప్పెయ్యడు. భరించలేనంత వేగం ఉండదు. కానీ, అతని చూపులోనే ఓ ఊపు కనిపిస్తుంది. అతగాడు రిథమిక్‌గా కాళ్లు కదిపేస్తుంటే.. చూడముచ్చటగా ఉంటుంది. చూసినవాళ్లకూ చేయాలనిపిస్తుంది. అలా చూసి, నేర్చుకొని, చిరంజీవిని గురువుగా భావించి కొరియోగ్రాఫర్లు అయినవారు ఎందరో ఉన్నారు. ఇప్పుడు తమ గురువుకు నృత్యరీతులను సమకూర్చి 'జై చిరంజీవ' అనుకుంటున్నారు. డ్యాన్స్ మాత్రమే కాదు.. ప్లేబ్యాక్ సింగర్ డైనమిక్స్‌కు నూరు శాతం న్యాయం చేసే నటుల్లో ముందువరుసలో ఉంటాడు. ఇళయరాజా, చక్రవర్తి, రాజ్-కోటి, బప్పీలహరి, మణిశర్మ ఇలా ఎందరో సంగీత దర్శకులు చిరు రిథమ్‌కు తగ్గట్టుగా ట్యూన్లు ఇచ్చారు. వేటూరి పాటకు వాటంగా నర్తించే అతని పాటవం మనం ఎన్ని సినిమాల్లో చూడలేదు. ఇన్ని క్వాలిటీలు చిరంజీవిని మెగాస్టార్‌ను చేశాయి. ఆయన కెరీర్‌లో మెగా హిట్లు, బంపర్ హిట్లతోపాటు కొన్ని సూపర్ ఫ్లాప్‌లు కూడా ఉన్నాయి. కానీ, నటుడిగా చిరు ఫెయిలైన పాత్ర ఇప్పటి వరకూ లేదు. ఇకముందూ ఉండదు!

**చెప్పులు** కుట్టేవాడిగా మెప్పించాడు. 'జేబుదొంగ'గా అలరించాడు. 'రౌడీ అల్లుడు'గా నవ్వించాడు. 'గ్యాంగ్‌లీడర్'గా రఫ్ఫాడించాడు. 'ఘరానా మొగుడు'గా ఆల్‌టైమ్ రికార్డ్స్‌కు కొత్త టర్నింగిచ్చాడు. 'ఇంద్ర'గా అదరగొట్టాడు. 'ఠాగూర్'గా ప్రశ్నించాడు. మరింత విస్తృతంగా ప్రజాసేవ చేయాలని గ్యాప్ తీసుకున్నాడు. అయిష్టంగానే సినిమాకు దూరమయ్యాడు. అనవసరంగా దూరమయ్యాడని అభిమానులు బాధపడ్డారు.

**కాలం** ఎంతో విలువైనది. పదేండ్ల కాలం.. ఇంకెంతో విలువైనది. పాతికేండ్ల నుంచి అరవై ఏండ్ల జీవనయానంలో మూడోవంతు సమయమిది. చేసే పనికి, వచ్చిన పనికి, నచ్చిన పనికి ఓ పదేండ్లు దూరమైతే! అతని పనైపోయినట్టే!! చిరంజీవి కూడా పదేండ్లు కోల్పోయాడు. కారణాలేవైనా ఫుల్‌స్వింగ్‌లో ఉన్న కాలాన్ని వదిలేసుకున్నాడు. మళ్లీ వస్తే... 'ఆ టైమింగ్ అందుకుంటాడా..?!' కొందరి డౌటు! 'ఖైదీ నంబర్ 150' ఆ అనుమానాలన్నిటినీ పటాపంచలు చేసింది. 'వాల్తేరు వీరయ్య'తో మెగా రేంజ్ తెలిసొచ్చింది. రాబోయే 'విశ్వంభర' మరో జగదేకవీరుణ్ని కండ్లముందు ఉంచుతుంది. నో డౌట్!!

**చివరగా** 'చిరూ! బాలూ చెప్పినట్టు... నీ నటనాగనిలో చెరగని పాత్రలెన్నో నివురుగప్పి ఉన్నాయి. తరగని నీ కీర్తికి అరగని రికార్డులెన్నో సాక్ష్యంగా ఉన్నాయి. సినిమాలో నువ్వుంటే.. మరో కమర్షియల్ ఎలిమెంట్ ఎందుకు? శుభలేఖ, స్వయంకృషి, ఆరాధన, రుద్రవీణ, ఆపద్బాంధవుడు ఎన్ని ప్రయోగాలు చేయలేదు! ఇప్పుడెందుకు చేయవు?? సినిమా పోతుందేమో.. పోనీ!! నువ్వు ఎప్పటిలాగే గెలుస్తావ్.. ఆ సినిమా ఎప్పటిలాగే గెలుస్తుంది!! మెగాస్టార్ ఆల్వేస్ మెగాస్టార్. పైగా ఇప్పుడు పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి!!'

...✍ కణ్వస



## చెట్టుగా చేయమన్నా ఓకే అనేదాన్ని!

టాలీవుడ్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లిన ఎందరో తారల్లో తాప్సీ పన్ను ఒకరు. వరుస అవకాశాలతో ఆమె బిజీ అయిపోయింది. బాలీవుడ్ స్టార్ హీరో షారుఖ్‌ఖాన్ తాజా సినిమా 'డంకీ'లో అద్భుతంగా నటించి విమర్శకుల మెప్పు అందుకుంది. కెరీర్‌లో తారాపథంలో దూసుకుపోతున్న తాప్సీ పంచుకున్న సంగతులు ఇవి...

**దర్శకుడు** రాజ్‌కుమార్ హిరానీని విపరీతంగా అభిమానిస్తాను. ఆయన సినిమా లంటే పిచ్చి. షారుఖ్‌ఖాన్, రాజ్‌కుమార్ కాంబినేషన్‌లో సినిమా వస్తుందని తెలిశాక.. ఎప్పుడెప్పుడు చూస్తానా అనుకున్నాను. ఓ రోజు ఆ సినిమాలో నేను నటిస్తున్నానన్న వార్తలు బీటౌన్‌లో వినిపించాయి. గాలి కబుర్లే అనుకున్నా, నాకు భలేగా అనిపించింది. ఆ ఆనందంలో ఉండగానే ఓ రోజు రాజ్‌కుమార్ ఫోన్ చేశారు. 'ఖాన్ సినిమాలో నువ్వున్నావన్న వార్తలు వినే ఉంటావుగా! అది నిజమే!! అధికారికంగా నీకు చెబుదామని ఫోన్ చేశాను. కథ విని ఓకే చెప్పుదువుగానీ' అన్నారు. నాకు ఓ నిమిషం నోట మాట రాలేదు. వెంటనే తేరుకొని 'మీ సినిమాలో చెట్టు పాత్ర పోషించమని చెప్పినా.. నాకు ఓకే' అని చెప్పా.

**షారుఖ్** సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయన్ను నేరుగా కలుసుకున్న సందర్భాలు లేవు. అలాంటిది ఆయనతో సినిమా అంటే కాస్త కంగారైంది. షూటింగ్ మొదటి రోజు ఏదో నార్మల్ సీన్ ఉంటుందని భావించా. కానీ, దాబాలో షారుఖ్‌తో వాదనకు దిగే సీన్ అని తెలిసింది. ఆయన చేసిన రొమాంటిక్ సినిమాలన్నీ నా కండ్లముందు కదలాడాయి. సినిమానే అయినా ఎలా వాదించేది అనిపించింది. కాసేపయ్యాక గానీ, కుదురుకోలేకపోయా.

**షూటింగ్** స్పాట్‌లో షారుఖ్ చాలా కూల్‌గా కనిపిస్తారు. షాట్ బ్రేక్‌లో సరదాగా మాట్లాడతారు. నాదీ ఢిల్లీనే కావడంతోనో ఏమో ఆయనతో తొందరగా కనెక్ట్ అయ్యా! ఎన్నో విషయాలు చర్చించేవారు. తన అభిప్రాయలను నిర్మొహమాటంగా చెప్పేవారు.

**రాజ్‌కుమార్‌తో** పనిచేయడం గొప్ప అనుభూతి. ఆయన ముందుగా ఎడిటర్‌గా చేశారు. షూటింగ్‌కు ముందే సీన్లన్నీ ఎడిటింగ్ చేసినట్టు అనిపించేవి. తనకు ఎలాంటి అవుట్‌కమ్ రావాలో పక్కాగా తెలిసిన దర్శకుడు ఆయన. రాజ్‌తో పనిచేయడం చాలా తేలిక అనిపించింది.

## అంధురాలి గాథ

•• నెరు

ఓటీటీ హిట్

**డిస్నీ+హాట్‌స్టార్:** జనవరి 23
**నటీనటులు:** మోహన్‌లాల్, అనశ్వర రాజన్, సిద్దిఖ్, శంకర్ చందుచూడన్, ప్రియమణి తదితరులు
**దర్శకత్వం:** జీతూ జోసెఫ్

మాలీవుడ్‌లో సూపర్‌హిట్ సాధించిన సినిమాలెన్నో ఓటీటీలో బంపర్ స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నాయి. అలా అలరిస్తున్న చిత్రమే 'నెరు'. సీరియస్ పాయింట్‌కు కోర్టు డ్రామా జతకలిపి ఆద్యంతం ఆసక్తికరంగా మలచడంలో దర్శకుడు జీతూ జోసెఫ్ సక్సెస్ సాధించాడు. దృశ్యం, దృశ్యం-2 సినిమాలతో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సృష్టించుకున్న జీతూ 'నెరు'లో ఏం చూపించాడు? సారా మహ్మద్ (అనశ్వర రాజన్) అంధురాలు. గుర్తుతెలియని వ్యక్తి ఆమెపై అత్యాచారం చేస్తాడు. మట్టితో శిల్పాలు చేయడంలో సిద్ధహస్తురాలైన సారా.. తనపై అత్యాచారం చేసిన వ్యక్తి శిల్పాన్ని చేస్తుంది. దాని ఆధారంగా పోలీసులు మైఖేల్ జోసెఫ్ (శంకర్)ను అరెస్టు చేస్తారు. మైఖేల్ సంపన్నుల బిడ్డ. అతణ్ని కాపాడుకోవడానికి మైఖేల్ తండ్రి పేరుమోసిన క్రిమినల్ లాయర్ రాజశేఖర్ (సిద్దిఖ్)ను రంగంలోకి దించుతాడు. అంధురాలు తనపై అత్యాచారం చేసిన వ్యక్తిని ఎలా శిల్పంగా చేస్తుందని వాదించి, నిందితుడికి బెయిల్ వచ్చేలా చేస్తాడు రాజశేఖర్. మరోవైపు సారా తరపున కోర్టులో వాదించడానికి ఏ లాయరూ ముందుకురాడు. పోలీసుల సూచన మేరకు సారా కేసు తీసుకోవాల్సిందిగా ఆమె తండ్రి... లాయర్ విజయ్ మోహన్ (మోహన్‌లాల్)ను ఆశ్రయిస్తాడు. చాలా రోజులుగా ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్న విజయ్ సారా కథ విన్నాక ఆమె తరఫున వాదించడానికి ఒప్పుకొంటాడు. ఇంతకీ సారాపై అత్యాచారం చేసింది ఎవరు? విజయ్ మోహన్ కేసు ఒప్పుకొన్న తర్వాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? విజయ్‌కి, రాజశేఖర్ కూతురు పూర్ణిమ (ప్రియమణి)కి ఉన్న సంబంధం ఏంటి? ఇదంతా మిగిలిన కథ.



## మీరుంటే చాలు!

'టైమ్ వచ్చినప్పుడు అస్సలు టైమ్ ఉండదు..' సినీజనాలకు బాగా వర్తించే డైలాగ్ ఇది. సక్సెస్‌లో ఉన్న యాక్టర్లకు తీరిక ఉండదు. కాల్‌షీట్లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుంటాయి. ఇప్పుడు ఈ సూత్రం ఓటీటీ యాక్టర్లకు మరింత అన్వయం అవుతుంది. ఓటీటీలో సత్తాచాటుతున్న నటుల కోసం నిర్మాణ సంస్థలు క్యూ కడుతున్నాయి. 'మీకు టైమ్ ఉన్నప్పుడే ప్రాజెక్టు మొదలుపెడతామ'ని ఓటీటీ స్టార్లను బతిమాలుకుంటున్నాయి.

**ఓటీటీ** వచ్చినప్పుడు 'ఫోన్‌లో ఎంత మంది చూస్తారు?' అనుకున్నారు. కానీ, ఇప్పుడు ఓటీటీ కంటెంట్‌కే మా ఓటు అంటున్నారు ప్రేక్షకులు. ఇక్కడ హిట్టయిన నటులు.. సినిమా అవకాశాలు వచ్చినా ఓకే చెప్పలేనంత బిజీ అయిపోయారు. మనోజ్ బాజ్‌పాయ్, షెఫాలీ షా, పంకజ్ త్రిపాఠి తదితర నటుల కాల్‌షీట్ల కాస్ట్ అమాంతం పెరిగిపోయింది. ఒక్కో కాల్‌షీట్‌కు రూ.7 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారట. మొత్తంగా ఒక వెబ్‌సిరీస్‌కు రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్లు తీసుకునే రేంజ్‌కు చేరుకున్నారు. అంతే కాదు, కథ అంతా సిద్ధమైనా.. ఈ స్టార్ల డేట్లు కుదరకపోతే ఆ ప్రాజెక్టును అటకెక్కిస్తున్నారు. సీనియర్ల సంగతి పక్కన పెడితే.. అనామకంగా వచ్చి ఒక్క వెబ్‌సిరీస్‌తో స్టార్‌డమ్ తెచ్చుకుంటున్నవారు కూడా ఉంటున్నారు. 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్‌సిరీస్‌లో పోలీసు పాత్ర పోషించిన శ్రేయ ధన్వంతరి ఇప్పుడు బిజీ ఆర్టిస్ట్. '1992 స్కామ్' వెబ్‌సిరీస్‌తో సూపర్‌స్టార్ అయిపోయింది. నాటకరంగ అనుభవంతో సినిమాల్లో అదృష్టం పరీక్షించుకున్న జైదీప్ అహ్లావత్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారాడు. ఇలా ఎందరో నటులు ఓటీటీలో మేటి అనిపించుకున్నారు. వాళ్ల కోసం దర్శక, నిర్మాతలు ఎదురుచూసే స్థాయికి చేరుకున్నారు.

